క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి. గోపూజ, గంగానయనము, వాసుదేవ పుణ్యాహవాచనం, మాతృకాపూజ, పంచగవ్యప్రాశన, రక్షాబంధనం తదితర పూజలు నిర్వహించారు.

నీటిని పొదుపుగా వాడాలి



నోటుపుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లెల్ల ఎంపీపీ పాఠశాలలో మనం ఫౌండేషన్ సహకారంతో జేకేఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం భాస్కర్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి పొదుపు–విశిష్టతపై అవగాహన కల్పించారు.

కాలినడకన శ్రీశైలానికి శివస్వాములు



కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లెకు చెందిన 20 మంది శివ స్వాములు మంగళవారం శ్రీశైల క్షేత్రానికి కాలినడకన బయలుదేరారు. ముందుగా గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శివస్వాములకు ఇరుముడులు కట్టారు.


లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణయ్య

సంజామల: పాలకేంద్రం నిర్వహకులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని ఆళ్లగడ్డ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య సూచించారు. మండల కేంద్రం సంజామలలోని ఏరియా ఆసుపత్రిలో పశుసంవర్ధక శాఖ డాక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లడుతూ పశువులకు సోకే వ్యాధులపై పాడిరైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అదేవిధంగా పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా రైతులను చైతన్య పరచాలన్నారు. ఏడీ డాక్టర్ మోహన్ రావు, డాక్టర్లు శివానంద, రఘలు పాల్గొన్నారు.

శివస్వాములకు బిక్ష ఏర్పాటు చేసిన ముస్లింలు



శివ మాలధారులకు బిక్ష వడ్డిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలో మతసామరస్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు శివ మాల స్వాములకు మంగళవారం బిక్ష ఏర్పాటు చేశారు. మతసామరస్య చైతన్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నూర్ అహ్మద్, మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ఎవ్వరి మతాన్ని వారు అనుసరిస్తూ, ఇతరుల మతాన్ని గౌరవించడమే మతసామరస్యం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు హిందూ, ముస్లిం సోదరులు మధ్య అనేకం జరగాలని శివ గురుస్వాములు మహేశ్వర్‌రెడ్డి, నారాయణ స్వామి అన్నారు. కార్యక్రమంలో సభ్యులు జయంత్ గౌడ్, రషీద్, నజీర్ అహ్మద్, బాషా, షాలీబేగ్ పాల్గొన్నారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

బేతంచెర్ల: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా బుధవారం ఉమ్మడి కర్నూలు జిల్లాకు మందకృష్ణ మాదిగ వస్తున్నారని నంద్యాల జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రామతీర్థం శేషు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

డోన్ రూరల్ : గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి సొంటి పులిశేఖర్ అధికారులను కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులుకు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, వరదరాజులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల.. అభివృద్ధి నిండుగా!

- రూ.16.91 కోట్లతో మౌలిక వసతులు
- రామ్‌కో సీఎస్ఆర్ నిధులతో రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రధాన రహదారి విస్తరణతో సాఫీగా రాకపోకలు
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు



విశాలంగా తీర్చిదిద్దిన ప్రధాన రహదారి



ఒకే చోట నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం



నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేది. పేరుకు మండల కేంద్రం అయినా కనీస మౌలిక వసతులు కరువై ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఎనిమిదివేలకు పైగానే జనాభా ఉంటున్నా ప్రజలకు కనీస సౌకర్యాలు ఉండేవి కావు. భూగర్భ జలాలు అడుగంటి ఏటా తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తుండేది. శ్రీకృష్ణదేవరాయలు నడయాడిన కొలిమిగుండ్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ప్రగతి పట్టాలెక్కింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవతో కొలిమిగుండ్ల రూపురేఖలు మారిపోయాయి. ఇరుకైన ప్రధాన రహదారితో అస్తవ్యస్థంగా ఉన్న రోడ్డు స్థితి గతులు మారిపోయాయి. విశాలమైన సీసీ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఇవన్నీ చూస్తే నిజంగా ఇది కొలిమిగుండ్లనా అని ఆశ్చర్యం అనిపించక మానదు. ఒకటి, రెండు కాదు ఏకంగా రూ.16.91 కోట్లతో పలు అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టడంతో కొలిమిగుండ్లకు సరికొత్త శోభ వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లతో కళకళలాడుతుంది. కొలిమింగుండ్లలో అభివృద్ధి నిండుగా జరిగిందంటూ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం

ప్రధాన రహదారి సమస్య స్థానికులను ఏన్నో ఏళ్ల నుంచి వేధిస్తుండేది. వాహనాల రాక పోకల సమయంలో దుమ్ము, దూళితో చాలా ఇబ్బందులు పడేవారు. స్టేట్ బ్యాంక్ నుంచి తేరు మిద్దె వరకు ప్రధాన రహదారి గుంతలు ఏర్పడి అధ్వాన్నంగా ఉండటంతో పాటు వర్షాకాలంలో చెరువును తలపించేలా మారుతుండేది. రాకపోకల ఇబ్బందులు గుర్తించి జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి పొక్లైన్ ఏర్పాటు చేయించి నీటిని మళ్లించిని సందర్భాలు కోకొల్లలు. ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ చొరవ తీసుకొని రూ.కోటి రూపాయలతో విశాలమైన సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు ఓవైపు క్లోజింగ్ డ్రైనింగ్ ఏర్పాటు చేసి మురుగునీటి సమస్య తొలగించారు. దశాబ్దాలుగా నెలకొన్న సమస్య తీరడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం ఆరు పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలను నాడు–నేడు పథకం కింద రూ.2.38 కోట్లతో అభివృద్ధి చేపడుతున్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తికాగా మరి కొన్ని స్కూళ్లలో పురోగతిలో ఉన్నాయి.

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ కృషితో రామ్‌కో సిమెంట్ సీఎస్ఆర్ నిధులతో మరింత అభివృద్ధి పనులు చేపడుతున్నారు. సుమారు రూ.13కోట్లతో పనులు చేపట్టారు. పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో రూ.7కోట్లతో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. కస్తూర్బా పాఠశాల సమీపంలో రూ.3కోట్లతో పంక్షన్ హాల్ నిర్మిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం అంతా గుంతలు ఏర్పడటంతో సీసీ రోడ్డు నిర్మించారు. టాయ్‌లెట్లు ఆధునీకరించి బస్టాండ్ చుట్టు ప్రహరీ నిర్మించారు. రామ్‌కో సహకారంతోనే రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు.

గ్రామంలో జరిగిన అభివృద్ధి వివరాలు

- రూ.80 లక్షలతో రెండు గ్రామ సచివాలయాల నిర్మాణం
- రూ.43 లక్షలతో రెండు రైతు భరోసా కేంద్రాలు
- రూ.17.50 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్
- రూ. కోటితో మెయిన్ రోడ్డు నిర్మాణం
- రూ.60 లక్షలతో కాలనీల్లో సీసీ రోడ్లు
- రూ.20 లక్షలతో గ్రావెల్ రోడ్డు
- రూ.39 లక్షలతో క్లోజింగ్ డ్రైనైజీ నిర్మాణం
- రూ.10 లక్షలతో రజకుల కోసం దోబీఘాట్‌లు
- నాడు–నేడు కింద రూ.30 లక్షలతో పీహెచ్‌సీలో పనులు
- రూ.28 లక్షలతో రెండు అంగన్‌వాడీ భవనాల పనులు
- రూ.8.50 కోట్లతో అవుకు మూడో ఫేజ్ కింద వాటర్ స్కీం
- రూ.2.38 కోట్లతో నాడు–నేడు కింద పాఠశాలల్లో పనులు

కొనసాగుతున్న అభివృద్ధి పనులు....

- జల్‌జీవన్ కింద రూ.50 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్
- రూ.50 లక్షలతో నేషనల్ హెల్త్ మిషన్ కింద బ్లాక్ క్లస్టర్ యూనిట్ పనులు





నాడు–నేడు కింద అభివృద్ధి చేసిన పీహెచ్‌సీ



నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

ప్రధాన రోడ్డు అధ్వాన్నంగా ఉండేది



పేరుకు మండలం అయినా ప్రధాన రహదారి అధ్వాన్నంగా ఉండేది. వాహనాల రాక పోకలతో దుమ్ముతో వ్యాధుల బారిన పడేవాళ్లం. కంకర తేలడంతో వాహనాలు తిరిగే సమయంలో రాళ్లు ఇళ్లలోకి వచ్చేవి. వర్షం కురిస్తే రోడ్డు కుంటలా మారుతుండేది. ఎట్టకేలకు రోడ్డు విశాలంగా మార్చడంతో సౌకర్యంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

–అశోక్, కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల రూపురేఖలు మారాయి



గతంలో ఎవరూ ఇంతలా అభివృద్ధి చేయలేదు. నెలల వ్యవధిలోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరిగింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతోనే కొలిమిగుండ్ల రూపురేఖలు మారిపోయాయి. ఇంతలా మార్పు వస్తుందని ఊహించుకోలేదు. ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– శివరామసుబ్బారెడ్డి, కొలిమిగుండ్ల

సంక్షిప్తం

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

డోన్ టౌన్ : పట్టణ సమీపాన జాతీయ రహదారిలో మ్యాక్స్‌ఫోర్ హోటల్ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ మంజునాథ(30)మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌కు చెందిన మృతుడు డ్రైవర్ సోమవారం బెంగుళూరులో నుంచి హైదరాబద్‌కు లారీ లోడ్‌తో వెళ్తుండగా స్పీడ్ అదుపు చేయలేక ముందు వెళ్తున్న లారీని వెనుక ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన మంజునాథను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు.

ఇద్దరికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. రేవనూరు ఎస్‌ఐ రాంమోహన్‌రెడ్డి సమాచారం మేరకు..దొర్నిపాడు మండలం చాకరాజువేములకు చెందిన లింగమయ్య, ప్రసాదు మరికొందరు కూలీలు మిరప కోత పనులకు గుండుపాపలకు ఆటోలో బయలుదేరారు. కోవెలకుంట్ల మండలం వల్లంపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ హాజర్‌వలి నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ముందు వెళ్తున్న ఎద్దుల బండి ఢీకొట్టాడు. డ్రైవర్ పక్కన కూర్చున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా మారెమ్మ ఆలయ వార్షికోత్సవం

కోవెలకుంట్ల: స్థానిక అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన మారెమ్మ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో ఏడాది క్రితం ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించారు. మూడు రోజుల పాటు జరిగే వార్షికోత్సవ వేడుకల్లో మొదటి రోజు అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని రాఘవరాజుపల్లె గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నంద్యాల, మోరగుడికి చెందిన ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో ఎనిమిది మంది వేదపండితుల బృందం విశేష పూజలు నిర్వహించారు. గురువారం చౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అందుబాటులో వశిష్ఠ వేరు శనగ విత్తనాలు

డోన్ టౌన్ : బనవాసిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వశిష్ఠ (TCG 1694)అనే వేరు శనిగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు వెంకటాపురం రైతు బరోసా కేంద్రం వ్యవసాయ సహాయకుడు వెంకట్రాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట కాలం 105 రోజుల నుండి 110 రోజులు పడుతుందని, ఒక ఎకరాకు దిగుబడి సుమారు 13 నుండి 15 క్వింటాళ్ల వరకు వస్తుందన్నారు. కేజీ రూ.125 చొప్పున నిర్ణయించినట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సుజాతమ్మ తెలిపారన్నారు.

108 ఈఎంటీలకు శిక్షణ

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని 108 కార్యాలయ ప్రాంగణంలో 108 వాహనాల్లో విధులు నిర్వహించే ఈఎంటీలకు మంగళవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. డోన్ డివిజన్ మేనేజర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ 108 వాహన సిబ్బంది 24 గంటలు ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండలన్నారు. కార్యక్రమంలో డోన్ డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటీవ్ చిన్నమున్నీ, ఈఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో డోన్ విద్యార్థి

డోన్ : హైదరాబాదులోని సెయింట్ థామస్ కేథ్రడాల్ చర్చిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఈవెంట్‌లో గంటపాటు ఎలక్ట్రానిక్ కీబోర్డు వాయించిన డోన్ శ్యాంజో స్కూల్ విద్యార్థి కొండెపోగు జనార్ధన్‌ను యాజమాన్యం అభినందించింది. హల్లేల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్టీన్ దండంగి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు గంటపాటు ఎలక్ట్రానిక్ కీబోర్డు వాయించి ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ బృందంలో ఉన్న విద్యార్థి కొండెపోగు జనార్ధన్‌ను హెచ్ఎం నిషాఫిలిప్ అభినందించారు.

29న దివ్యాంగుల సింహగర్జన

డోన్ : కర్నూలు ఎస్‌టీ, బీసీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 29న జరిగే దివ్యాంగుల సింహగర్జన సభకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని దివ్యాంగులు తరలిరావాలని జిల్లా దివ్యాంగుల సంఘం జేఏసీ కార్యదర్శి శివశంకర్ పిలుపునిచ్చారు. స్థానిక దివ్యాంగుల కార్యాలయంలో సంహగర్జన సభకు సంబంధించిన పోస్టర్లను నాయకులు వాసుదేవుడు, పల్లవిలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలని కోరారు. సభ్యులు పెద్దన్న, గిడ్డారెడ్డి, గుమ్మకొండ రవి, మహబూబ్ బాషా, మధు, నాగేష్, వెంకటేశ్వర ఆచారి, రాజేష్‌లు పాల్గొన్నారు.

ముస్లింలకు ఏమి చేశావని... ఆ ప్రగల్భాలు!

- టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డిని నిలదీసిన ముస్లిం మైనార్టీ నాయకులు



మాట్లాడుతున్న అత్తార్‌జాహెద్

బనగానపల్లె రూరల్ : గత టీడీపీ ఐదేళ్ల పాలనలో అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం చేసిన మంచి పని చేప్పుకునేందుకు ఒక్కటి కూడా లేదని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహెద్‌తోపాటు మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, పలువురు ముస్లిం మైనార్టీ ముఖ్య నాయకులు విమర్శించారు. ఈ నెల 25న పట్టణంలోని చార్ కమాన్ మసీద్ వద్ద జరిగిన కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి... ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని విమర్శించడాన్ని వారు ఖండించారు. మంగళ వారం సాయంత్రం ఎమ్మెల్యే కాటసానిస్థానిక స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బీసీ తీరును తప్పుపట్టారు. చార్‌కమాన్ మసీద్ వద్ద కాంప్లెక్స్ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే కేవలం రూ.3లక్షలు ఇచ్చారని, అయితే కాంప్లెక్స్ మొత్తం ఆయనే నిర్మించినట్లు హంగామ చేయడం సిగ్గు చేటని, ముస్లింలకు ఏమి చేశారని ప్రగల్బాలు పలుకుతున్నాని ప్రశ్నించారు. ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలంతో పాటు ఎంతో మంది దాతలు సహాయం చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముస్లింలకు శ్మశానవాటిక, రూ.35లక్షల సొంత నిధులతో ఇబదాత్‌ఖానా నిర్మాణం, మదరసాకు, మర్కస్ మసీద్‌కు స్థలం కేటాయింపు తదితర ఎన్నో మంచి పనులు చేశారని వివరించారు.

పేదలకు ఇంటి స్థలాల పంపిణీకి.. భూమి ఎక్కడ కొనుగోలు చేశారు?

ఎన్నికల తర్వాత బనగానపల్లెలో సొంత డబ్బుతో భూములు కొనుగోలు చేసి పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఉచితంగా పంపిణీ చేస్తామని మాజీ ఎమ్మెల్యే బీసీ ప్రగల్బాలు పలుకుతున్నారని, ఆ భూమి ఎక్కడ కొనుగోలు చేశారో ప్రజలకు తెలియ జేయాలని డిమాండ్ చేశారు. తాను షాదీఖానా నిర్మాణానికి రూ. కోటి మంజూరు చేశామని చెబుతున్న బీసీ... ఆ నిధులు ఎక్కడ ఉన్నయో చూపించాలని ప్రశ్నించారు.

మార్చి 1న ఆస్థానం వద్ద ప్రమాణం చేసేందుకు సిద్ధం!

ఎన్నికలు సమీస్తుండడంతో మాజీ ఎమ్మెల్యే బీసీ శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహెద్ విమర్శించారు. బీసీ... అన్న మృతిపై తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, తన అన్న మృతిపై బీసీ చేసిన అసత్యారోపణలు తగవన్నారు. ఈ వ్యాఖ్యలపై మార్చి 1వ తేదీన పట్టణంలోని ఆస్థానం వద్ద ప్రమాణం చేసేందుకు సాయంత్రం 4 గంటలకు ఉంటానని, దమ్ముంటే బీసీ జనార్ధన్‌రెడ్డి రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు కలాం, ఖానిక్, సునార్ ఆసిఫ్, అష్రఫ్, జైను, యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

బనగానపల్లె రూరల్ : భూ సేకరణలో భూములు కోల్పోవు రైతులకు 2013 భూ సేకరణ చట్టప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పాతపాడు గ్రామం వద్ద సోలార్, పవన విద్యుత్ పునరుత్పాధక పరిశ్రమల ఏర్పాటు కోసం రైతులు కోల్పోతున్న భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అనుమతితోనే భూ సేకరణ చేయాలని, భూమి ఇచ్చిన రైతుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. భూ సేకరణను వ్యతిరేకిస్తూ 29న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

బేతంచెర్ల: పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర పోరాటయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ 93 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్ర శేఖర్ ఆజాద్ చేసిన పోరాటాలను ఉదయ్ గుర్తు చేశారు.

వృద్ధురాలికి స్ఫూర్తి చేయూత



వృద్ధురాలికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు

డోన్ టౌన్ : పట్టణంలోని రైల్వే గేట్ల సమీపంలో నివశిస్తున్న అనాథ నిరుపేద వృద్ధురాలికి స్ఫూర్తి సేవా సమితి సభ్యులు చేయూతనిచ్చారు. ఆమెకు నిత్యావసర సరుకులు అందజేశారు. నా అనేవాళ్లు ఎవ్వరూ లేని అనాథ వృద్ధురాలు సుంకమ్మ ఆరేళ్ల మనవరాలితో రైల్వే గేట్ల ప్రక్కన ఒక చిన్న గుడిసెలో అత్యంత దయనీయ స్థితిలో జీవనం సాగిస్తుంది. ఆహారం కోసం సైతం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన స్ఫూర్తి సభ్యులు బస్తా బియ్యం, రెండు నెలలకు సరిపడ కిరాణం సరుకులు, కొత్త బట్టలు, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు సీసంగుంతల మధు, భాస్కర్, వాసు, రాజు, యోగి తదితరులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు



ఒకవ సచివాలయం పరిధిలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

డోన్ : వేసవిలో ఎదురయ్యే మంచినీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. స్థానిక ఒకటవ సచివాలయం పరిధిలో మంగళవారం ఆయన అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుండి నీటి సరఫరా పైపులైన్‌ను కొందరు తరచుగా ధ్వంసం చేస్తుండడం మూలంగా మంచినీటి సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. మార్చి, ఏప్రిల్ మాసంలో గోరుకల్లు రిజర్వాయర్ నుండి శుద్ధజలం ప్రతి ఇంటికీ సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. మంచి నీటిని పొదుపుగా వాడి నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని ఆయన ప్రజలను కోరారు. నీటి కోసం మోటార్లు వినియోగించడం, మురిగు కాలువల్లో నీటిపైపులను వదిలివేయడం లాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యహరిస్తామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి సిద్ధం

- నేడు ప్రారంభించనున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

సంజామల: సంక్షేమం,అభివృద్ధికి సమానంగా ప్రాధ్యాన్యతనిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారు. పట్టణాలతో సమానంగా పల్లెల్లోనూ మౌలిక వసతులు కల్పిస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. మండల కేంద్రం సంజామలలో ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు మెరుస్తున్నాయి. గ్రామంలో రూ.1.52 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ.40 లక్షలతో నూతన గ్రామ సచివాలయం, రూ.22 లక్షతో రైతు భరోసా కేంద్రం, జల్‌జీవన్ పథకం కింద 40 వేల లీటర్ల సామర్థ్యంతో రూ.35 లక్షలతో ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయ్యింది. ఎస్టీ, ఎస్సీ, బీసీ కాలనీలలో రూ.45 లక్షలతో సీసీ రోడ్డు డ్రైనేజీ నిర్మాణం, రూ.10 లక్షలతో రస్తా గ్రావేల్ రోడ్డు నిర్మాణం పనులు పూర్తియ్యాయి. ఈ మేరకు బుధవారం అభివృద్ధి పనులను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతు పాపిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించనున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.



రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం



రూ.22 లక్షతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



రూ.35 లక్షలతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంక్



నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



మందులు అందజేస్తున్న ఎంపీడీఓ మల్‌రెడ్డి

అవుకు: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అన్నారెడ్డి మల్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని శింగనపల్లె గ్రామంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఆకుమళ్ల పీహెచ్‌సీ డాక్టర్ జయభారత్ రెడ్డి ,స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రదీప్, నివేధితలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 427 మందికి బీపీ, షుగర్, గుండె తదితర వైద్య పరీక్షలు చేసి, అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో పీఎంజేవై కార్డులను ఎంపీడీఓ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



మహిళతో మాట్లాడుతున్న డాక్టర్ రాజేశ్వరి

ప్యాపిలి: మండల పరిధిలోని పెద్దపాదిళ్లలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎంపీడీఓ సాయి మనోహర్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు వాణిశ్రీ, నరేశ్, రాజేశ్వరి తదితరులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 565 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయకుమారి, రాఘవేంద్రగౌడు, మనోహర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు కమతం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.